TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం | ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి | జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 136 | ఆదివారం, జూన్ 7, 2026 | పేజీలు : 04 | వెల రూ. 1.00/-

ARK MEDIA SUBSCRIBE

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754



# హైదరాబాద్‌కు ఉపశమనం..

## పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం

వేసవి తాపం నుంచి నగరవాసులకు ఉపశమనం

గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఉప్పల్ సహా పలు ప్రాంతాల్లో జల్లులు

**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని**

గత కొద్దిరోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులకు శనివారం ఉపశమనం లభించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట లభించింది. ఇక పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలోని కొహెడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

# పేదలు చెరువులను ఆక్రమిస్తే అర్థముంది.. ధనికులు కూడా చెరువులను కబ్జా చేస్తే ఏమనాలి?

సీఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వ ఆస్తులు, జల వనరుల పరిరక్షణకే హైడ్రా ఏర్పాటు అని వెల్లడి

యువతలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఈగిల్ ఫోర్స్

రాష్ట్రంలో మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్

హైడ్రా ద్వారా రూ.1 లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడినట్లు వెల్లడి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా, ఈగిల్ ఫోర్స్ విభాగాలు నేడు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన 'ది హిందూ హడిల్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ అంశాలపై ప్రసంగించారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను అక్రమ కట్టడాల నుంచి కాపాడేందుకు 2024 జులైలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సీనియర్ ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో, రిటైర్డ్ ఆర్మీ సిబ్బందితో కలిపి సుమారు 3,000 మంది సిబ్బందితో పనిచేస్తున్న ఈ ఏజెన్సీ, ఇప్పటివరకు రూ. 1 లక్ష కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని తెలిపారు. "గతంలో పలుకుబడి ఉన్నవారు విల్లాలు, ఫామ్‌హౌస్‌ల కోసం జలవనరులను కబ్జా చేసేవారు. ఇప్పుడు ఆ సాహసం ఎవరూ చేయడం లేదు" అని రేవంత్ రెడ్డి వివరించారు. పేదలు చెరువులను కబ్జా చేస్తే అర్థముంది.. కానీ ధనికులు కూడా చెరువులను ఆక్రమిస్తే ఏమనాలి? అంటూ వ్యాఖ్యానించారు. అదే సమయంలో, యువతను లక్ష్యంగా చేసుకున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈగిల్ ఫోర్స్ పనితీరును ఆయన ప్రశంసించారు. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన యాంటీ-నార్కోటిక్స్ విభాగాల్లో ఇది ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

**పాలనాపరమైన ఇతర అంశాలు..**

తమ ప్రభుత్వం గత 15 నెలల్లో కాలంలోనే 67,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, త్వరలోనే మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు రుణమాఫీ, మహిళా స్వయం సహాయక బృందాలకు ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక కార్యక్రమాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు కల్పించామని, తద్వారా ప్రభుత్వ రాబడి తగ్గినా పర్యావరణ హితానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన వెల్లడించారు.



# నిరుద్యోగులకు శుభవార్త.. టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన

విద్యాశాఖలో డీవైఈవో, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల భర్తీ

మొత్తం 24 ఉన్నత స్థాయి పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

జూన్ 12 నుంచి జులై 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్

**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని న్యూస్**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వరుసగా శుభవార్తలు అందిస్తోంది. కమిషన్ పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియలో స్పష్టమైన వేగం కనబరుస్తూ, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రెండో కీలక ఉద్యోగ ప్రకటనను జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణను బలోపేతం చేసే లక్ష్యంతో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీవైఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పనితీరును మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఈ సడలింపుల వల్ల సీనియర్ అభ్యర్థులకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు మంచి అవకాశం లభించనుంది. అర్హులైన అభ్యర్థులు జూన్ 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా జులై 19ని నిర్ణయించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అభ్యర్థులు గడువు తేదీలోగా ముందే దరఖాస్తు చేసుకోవడం మంచిదని కమిషన్ సూచించింది. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, విద్యా అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, జిల్లాల వారీగా ఖాళీల కేటాయింపు, దరఖాస్తు రుసుము వంటి సమగ్ర సమాచారం కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ట్రజూం౦ఎ.ట్రశీజ.ఱఅ ను సంప్రదించాలని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి వెబ్‌సైట్‌లో పూర్తిస్థాయి నోటిఫికేషన్ పీడీఎఫ్‌ను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

# అమెరికాలో తెలంగాణ యువకుడి కాల్చివేత

అన్షుల్ పిజ్జా డెలివరీ చేస్తుండగా దుండగుల కాల్పులు

నార్త్ ఫిలడెల్ఫియాలో ఘటన

మృతుడిని మేడ్చల్ జిల్లా వాసిగా గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 6 (నేటి ప్రభాత దర్శిని) :**



ఉపాధి నిమిత్తం అమెరికా వెళ్లిన తెలంగాణకు చెందిన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నార్త్ ఫిలడెల్ఫియాలో పిజ్జా డెలివరీ చేస్తుండగా గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో అతడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన కుంచ అన్షుల్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే, అన్షుల్ అమెరికాలో పిజ్జా డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే విధుల్లో భాగంగా పిజ్జా డెలివరీ చేసేందుకు వెళ్లగా, దుండగులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అన్షుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్షుల్ మరణవార్త విన్న అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కుమారుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.


# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

ముందస్తు చర్యలకు సిద్ధం కండి

ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు

కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు

**హైదరాబాద్, జూన్6(నేటి ప్రభాత దర్శిని):**



తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# వార్డు సభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతానికి అందరూ సహకరించాలి**

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**





**నేటి ప్రభాత దర్శిని కామారెడ్డి ప్రతినిధి. కరుణాకర్**

ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 40వ వార్డులో శనివారం వార్డు సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వార్డు సభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు వేదికలుగా నిలుస్తాయని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రతి కుటుంబం చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపాలిటీకి అందించాలని సూచించారు. "జల్ సంచయ్ -- జల్ భాగీధారి" కార్యక్రమం కింద వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా మురుగు కాలువల పూడిక తొలగింపు, నీరు నిల్వ కాకుండా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారులు ,వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంటువ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్‌ను పొదుపుగా , సురక్షితంగా వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా పోలీసు అధికారులు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీ వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) ఎన్.వై. గిరి, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, తహసీల్దార్ హిమబిందు, హౌసింగ్ విజయపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# నవజాత శిశువుల ఆరోగ్యం గుర్తింపు

**శిశుమాపన్ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం**

**ఎఐతో అనుసంధానించినట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**అమరావతి,జూన్6(నేటి ప్రభాత దర్శిని):**



నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను సులభంగా, ఖచ్చితంగా గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా పనిచేసే 'శిశు మాపన్' యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పుట్టిన పిల్లలను చేతులతో తాకాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మొబైల్ వీడియో ద్వారా వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేయవచ్చు. సాధారణంగా నవజాత శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతలను సాంప్రదాయ పద్ధతుల్లో కొలవడం కొంత శ్రమతో కూడుకున్న పని. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు గాను.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 'ఆశా' యాప్‌తో ఈ 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించారు. ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లకు ఈ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేశారు. మంగళగిరిలో సాధించే ఫలితాలు, క్షేత్రస్థాయి అనుభవాలను పరిశీలించిన అనంతరం ఈ అధునాతన ఏఐ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

# జర్నలిస్టు మిత్రులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్






**నేటి ప్రభాత దర్శిని. కామారెడ్డి ప్రతినిధి. కరుణాకర్.**

వర్షాకాలంలో విధులు నిర్వహించే జర్నలిస్టులకు ఉపయోగపడేలా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు రెయిన్‌కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎండలు, వర్షాలు, ఇతర ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలకు సమయానుకూలంగా సమాచారాన్ని చేరవేస్తూ జర్నలిస్టులు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో వార్తల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించే మీడియా ప్రతినిధులకు రెయిన్‌కోట్లు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిపాలనకు మీడియా ఎల్లప్పుడూ సహకరిస్తోందని, అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చీఎ గిరి, ఇూ=ూ తిరుమల, ఇూూ మురళి, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రింట్ అండ్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# కోనాపూర్ గ్రామసభకు అధికారులు గైర్హాజర్

**4 రోజుల క్రితమే బదిలీ అయిన అధికారే స్పెషల్ ఆఫీసర్**

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభకు పలువురు అధికారులు హాజరు కాకపోవడం విమర్శలకు తావిచ్చింది. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు స్పెషల్ ఆఫీసర్‌గా నాలుగు రోజుల క్రితమే బదిలీ అయిన అధికారిని నియమించడం గ్రామస్థుల్లో ఆశ్చర్యం కలిగించింది. కోనాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో పలువురు అధికారులు పాల్గొని గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. సర్పంచ్ గ్రామ పంచాయతీ ఆదాయ-వ్యయ వివరాలను సభకు వెల్లడించారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చ జరిగింది.

**స్పెషల్ ఆఫీసర్ గైర్హాజర్**

గ్రామసభకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిన అధికారి నాలుగు రోజుల క్రితమే బదిలీ అయినట్లు తెలిసింది. బదిలీ అయిన కారణంగా ఆయన గ్రామసభకు హాజరు కాలేకపోయారు. బదిలీ అయిన అధికారినే స్పెషల్ ఆఫీసర్‌గా నియమించడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్‌డేట్ చేసిన జాబితా పంపకుండా పాత ఉత్తర్వులతోనే సభ నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి. గ్రామసభకు సంబంధిత ఫారెస్ట్ అధికారులు కూడా హాజరు కాలేదు. గ్రామ పరిధిలో అటవీ భూములు, హరితహారం, పల్లె ప్రకృతి వనం వంటి అంశాలపై ఫారెస్ట్ శాఖ నుండి సమాచారం రావాల్సి ఉండగా, అధికారులు గైర్హాజరు కావడంతో చర్చ జరగలేదు. అధికారులు గైర్హాజరు కావడంతో గ్రామస్థులు తమ సమస్యలను అధికారుల ముందుంచుకోలేకపోయారు. బదిలీ అయిన అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా పెట్టడంతో సభ ప్రాధాన్యత తగ్గిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. సక్రమంగా అధికారులతో గ్రామసభ నిర్వహించాలని, ప్రజా సమస్యలపై స్పందించాలని వారు కోరారు. పంచాయతీ అధికారులు సభ కార్యకలాపాలు పూర్తి చేసి రిపోర్టు పై అధికారులకు పంపనున్నారు. గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లగౌని కిష్టవ, రాజేశ్వర్గౌడ్,వార్డు సభ్యులు సాయిలు హనుమంతు సౌమ్య లక్ష్మి సావిత్రి శ్రీకాంత్ కాశీరాం గ్రామస్తులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.



# గండిపేట భూకబ్జా కేసు

**వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్**

**చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్6(నేటి ప్రభాత దర్శిని):**

గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్ విధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# నూతన పైప్ లైన్ పనుల్లో వేగం పెంచాలి

**నిజామాబాద్ లో మంచినీటి పైప్ లైన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

**నేటి ప్రభాత దర్శిని నిజామాబాద్ జూన్ 7:-**



నిజామాబాద్ పట్టణంలోని స్థానిక మిర్చి కాంపౌండ్ కి వెళ్లే దారిలో నూతనంగా వేస్తున్న మంచినీటి పైప్ లైన్ పనుల్లో వేగం పెంచాలని తద్వారా ఆ యొక్క ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అధికారులకు తెలిపారు, అర్బన్ ఎమ్మెల్యే శనివారం రోజు నిజామాబాద్ నగరంలోని మార్వాడి గల్లి మిర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న మంచినీటి పైప్లైన్ అభివృద్ధి పనులను పరిశీలించారు, ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ మీడియాతో మాట్లాడుతూ మంచినీటి పైప్లైన్ లీకేజీ కావడంతో ఈ ప్రాంతంలో మురికి నీరు చేరి మంచినీరు కలుషితం అవుతున్నదని ఈ యొక్క సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు నూతన పైప్ లైన్ అభివృద్ధి పనులను, తాను ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ యొక్క సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే విధంగా కృషి చేస్తున్నానని అర్బన్ ఎమ్మెల్యే మీడియాకు వెల్లడించారు. ఇంకా ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఈ యొక్క ప్రాంతంలో ఉన్న పైప్ లైన్ వ్యవస్థ పూర్తిగా శిధిలావస్థకు చేరడంతో ఈ ప్రాంతంలోని పైప్ లైన్లన్నీ దెబ్బతిన్నాయని అర్బన్ఎమ్మెల్యే ధన్పాల్ పేర్కొన్నారు, కాగా ప్రస్తుతము కొనసాగుతున్న నూతన పైప్ లైన్ పనులను నాణ్యతతో చేపట్టాలని తాను సంబంధిత శాఖల అధికారులకు సూచించడం జరిగిందని అదేవిధంగా ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మరియు వీలైనంత తొందరగా ఈ యొక్క మార్వాడి గల్లి మరియు మిర్చి కాంపౌండ్ ప్రాంతంలోని పైప్ లైన్ నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని, అంతేకాకుండా ఎప్పటికప్పుడు ఈ యొక్క పనులను అధికారులు పర్యవేక్షించాలని తాను సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మీడియాకు తెలిపారు. ఇంకా సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ వెంట స్థానిక కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మీనారాయణ సీనియర్ బిజెపి నాయకులు మఠం పవన్ పవన్ ముందడ స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.